క్లుప్తంగా

బంగారు, వెండి కిరీటాల బహూకరణ



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో కొలువైన సాయిబాబా గుడిలో ఆదివారం తొమ్మిదో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ ప్రొఫెసర్ నందిరాజు వెంకట శ్రీకాంత్, డాక్టర్ అనీత ప్రియదర్శిని దంపతులు రూ.3లక్షల విలువ గల బంగారు, వెండి కిరీటాలు ఆలయానికి బహూకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహాఅన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రిటైర్డ్ డీఎస్పీ రాజిరెడ్డి, జెడ్పీటీసీ వంగ రవీందర్, డాక్టర్ తిప్పని సుధాకర్, తారాబాయి, సూర్య ప్రకాశ్, అర్చకులు కోటేశ్వర్, పాలకవర్గ సభ్యులు తదితరలు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



వేలేరు: మండలంలోని ఎర్రబెల్లి శివారులోని బైరవునిబండ వద్ద నిర్వహించిన సమ్మక్క –సారలమ్మ జాతర హుండీల్లో భక్తులు వేసిన కానుకలను నిర్వాహకులు కాలేరు పుష్పలీలా చిన్నబాబు ఆధ్వర్యంలో ఆదివారం లెక్కించారు. నాలుగు రోజులు నిర్వహించిన జాతరలో రూ.77,878 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అల్లం సతీష్, గ్రామస్తులు, కోయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

'మెపా' రాష్ట్ర కార్యదర్శి నియామకం



పిట్టల రమేష్

దామెర: మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని ల్యాదెకు చెందిన పిట్టల రమేష్‌ముదిరాజ్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ఈమేరకు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కుల సంఘం బలోపేతం కోసం తన వంతు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ధర్మసాగర్: మండలంలోని పలు ప్రాంతాల్లో నేడు(సోమవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ డీఈ సామ్యా నాయక్, ధర్మసాగర్ ఏఈ సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్కుర్తి ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా ధర్మసాగర్, సాయిపేట, నారాయణగిరి సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం మధ్యాహ్నం 01 (ఒంటి) గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుదీప్ శర్మకు గౌరవ డాక్టరేట్



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు తాటిపాముల అనుదీప్ శర్మ ఆస్ట్రాలజీ స్పిరిచ్వాల్టి రీసెర్చ్ విభాగంలో గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తమిళనాడులోని హుసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టా అందుకున్నారు. అనుదీప్ శర్మను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

సమ్మేళనానికి తరలిన మహిళలు



ఆత్మకూరు: వరంగల్ నగరంలో ఆదివారం మహిళాశక్తి సమ్మేళన సమితి ఆధ్వర్యంలో జరిగిన మహిళాశక్తి సమ్మేళనానికి మండలకేంద్రం నుంచి మహిళలు తరలివెళ్లారు.

విక్రయానికి పశువులు

- అప్పుల్లోంచి బయటపడేందుకు రైతుల తిప్పలు
- పరకాల పశువుల సంతనుంచి విచ్చలవిడిగా తరలింపు



విక్రయానికి సంతకు తీసుకొచ్చిన పశువులు

పరకాల: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో ప్రకృతి కన్నెర చేయడం.. ఎంతో కొంత మిగిలిన దిగుబడికి మద్దతు ధర లేక పోవడంతో చివరకు అప్పులే మిగిలి ఉండటంతో చాలా మంది రైతులు తప్పని పరిస్థితుల్లో పశువులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది. వ్యవసాయానికి గొడ్డు చాకిరి చేయలేక కనీసం చేసిన అప్పులను తీర్చుకోవడానికి ఉన్న పశువులను అమ్ముకోవడానికి సంత బాట పడుతున్నారు. అధిక ధర పెట్టే వారు లేక చివరకు కోతలకే అమ్ముకోవాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల అమ్మకాలపై కేంద్రప్రభుత్వం నిర్ణయం ప్రభావం మచ్చుకు కూడా కనిపించలేదు. పశువుల విక్రయాల్లో హనుమకొండ జిల్లాలో పరకాల పశువుల సంత మొదటి స్థానంలో నిలుస్తుందని చెప్పవచ్చు. టెండర్ ప్రక్రియ ద్వారా ప్రతి ఏడాదికి పరకాల మున్సిపాలిటీకి రూ.30లక్షల ఆదాయం వస్తుందంటే పరకాల పశవుల సంతలో విక్రయాలు ఎంతజోరుగా ఉంటాయో స్పష్టం అవుతుంది. పశవుల విక్రయాలు, కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం ఇక్కడి పశువుల సంతలో చెల్లుబాటు కాకుండా కోతలకు భారీగా పశువుల విక్రయాలకు జరుగుతున్నట్లు తెలుస్తుంది. వ్యవసాయ అవసరాలకే విక్రయించాలంటూ చేసిన చట్టం రూపకల్పన ఎక్కడ కనిపించకపోగా సంత కమిటీ పర్యవేక్షణ ఉండాలంటూ జారీ చేసిన ఆదేశాలు పాటించలేదు. నిబంధనలు దిక్కరిస్తే జైలుకు వెళ్లాల్సిందేనని కేంద్రప్రభుత్వం హుకుం జారీ చేసినా.. పట్టించుకున్నవారే కరువయ్యారు. వారానికి 300పైగా పశువులను, గేదేలను 4 లారీల్లో కభేళాలకు తరలించడం గమనార్హం. మద్దతు ధరలు రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పంట దిగుబడి ఉన్న మద్దతు ధర లేక చాలా మంది రైతులు వ్యవసాయం చేయడమే పాపం అయిందని.. చేసిన అప్పులైనా తీర్చడం కోసం పశువులను అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులను విక్రయించకుంటే అప్పులు తీర్చలేమని వాపోవడం గమనార్హం.



లారీలో ఎక్కిస్తున్న పశువులు

అప్పుల పాలయ్యాం



పంటలకు మద్దతు ధర లేకపోవడంతో వ్యవసాయం చేయాలంటే భయమోస్తుంది. పంటలు చేతికొచ్చే సమయానికి వరదలు, అకాల వర్షాలతో పంటలు నష్టపోతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో పశువులకు పశుగ్రాసం(గడ్డి)కూడా కరువైపోతుంది. దీంతో తప్పని పరిస్థితుల్లో పశువులను అమ్ముకోవాల్సి వస్తుంది.

– కె.తిరుపతిరావు, రైతు, పరకాల

అగ్గువ ధరకే అమ్మిన..



వ్యవసాయం చేసుకొని బతుకుతుంటే మిర్చి ధర పడిపోయింది. బొచ్చెడు అప్పుతెచ్చి వ్యవసాయం చేస్తే అప్పే మిగిలింది. పశువులను అమ్ముకోక పోతే పెళ్లాం మొగుల్లం సావలే. అందుకే మూడు పశువులను పట్టుకొస్తే ధర లేక కోతకు ఒకటి అగ్గువ ధరకే అమ్మినం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– ఎస్.రాజీర్, నాగారం

అగ్రంపహాడ్‌లో కొనసాగుతున్న మొక్కులు



హుండీలను తరలిస్తున్న అధికారులు



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఆత్మకూరు: మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. ఆర్డీఓ శ్రీనివాస్, ఈఓ శేషగిరి పర్యవేక్షించారు. అధికారులు హుండీలను తరలించారు.

విద్యార్థుల క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

- అసిస్టెంట్ కమాండెంట్ వేణుగోపాల్‌రెడ్డి



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న అసిస్టెంట్ కమాండెంట్ వేణుగోపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్: విద్యార్థులు చదువుతో పాటు ఏకాగ్రతను పెంపొందించుకుంటే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అసిస్టెంట్ కమాండెంట్ వేణుగోపాల్ రెడ్డి సూచించారు. ఆదివారం ఖిలావరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలోని టీఎస్ఎస్పీ కృష్ణవేణి హైస్కూల్‌లో పాఠశాల చైర్మన్ పట్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బి. సత్యనారాయణ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కమాండెంట్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో నిరాశ, నిస్పృహ, నిస్సహాతలోనుకాకుండా ప్రణాళిక ప్రకారం చదివి విజయం సాధించాలన్నారు. పరీక్ష రాసేముందు రాత్రి ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా నిద్రించాలన్నారు. పరీక్షలో అత్యధికశాతం ఉత్తీర్ణత సాధించి గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరుతీసుకురావాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, ఆటపాట కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం హనుమకొండ జిల్లా శాఖ సమావేశం ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం బాధ్యులు మిద్దెపాక ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్యాల బాబు, ఉపాధ్యక్షులుగా సింగారపు అయిలయ్య, మాదాసి నవీన్‌కుమార్, కె.దేవయ్య, వేలేరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల అర్జున్, సంయుక్త కార్యదర్శులుగా సాంబరాజు, కె ప్రతాప్. ఎం.సురేష్, ఎం.పద్మారావు, కె.సునీల్, కోశాధికారిగా చాణక్య ఎన్నికయ్యారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా గోవిందర జాక్, సాంస్కృతిక కార్యదర్శులుగా కె.సదానందం, ఎ కరుణాకర్, కార్యవర్గసభ్యులుగా అరెపల్లి శ్రీనివాస్, మేడి రాములు, జన్నుసాయిప్రసన్న, మేకల ప్రవీణ్, ఎన్నికయ్యారు. సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.అయిలయ్య, ఎన్నికల పరిశీలకులుగా యాదగిరి, రవి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ ఇవ్వాలి

వర్ధన్నపేట : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నెలకు రూ.4 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి కోరారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో కలిసి పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక మంది పేదలు షుగర్, బీపీ, డయాలసిస్, హెచ్ఐవీ, తదితర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో సతమతమౌతూ వైద్యం చేయించుకోలేని దుస్థితిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అలాంటి వారికి ప్రభుత్వం ప్రతీనెల పింఛన్ ఇవ్వడంతోపాటు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేలా విద్యారంగంలోని ఉద్యోగ ఖాళీలన్నిటినీ భర్తీ చేయాలని, కంప్యూటర్ విద్యను అందించాలని ఆకాంక్షించారు. పాస్టర్లకు భృతి అందించాలని, క్రిస్టియన్లకు దళిత హోదా కల్పించాలని, దళితులను వేద పాఠశాలల్లో చదివించి ఆలయాల్లో అర్చకులుగా నియమించాలని కోరారు.

'ముదిరాజ్'ల అభివృద్ధే ధ్యేయం

నర్సంపేట : ముదిరాజ్ కులస్తుల అభివృద్ధే ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) ధ్యేయమని జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ తెలిపారు. పట్టణంలోని అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ రాజకీయ నాయకులకు, పార్టీలకు అమ్ముడు పోదని స్పష్టం చేశారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం మెపాను వాడుకుంటూ పార్టీలకు తాకట్టు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. రాజకీయ నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి స్వప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని పేర్కొన్నారు.

అంబేడ్కర్ భావజాలాన్ని అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

ఎల్కతుర్తి: అంబేడ్కర్ భావజాలాన్ని ప్రతి ఒక్కరికీ అందించాల్సిన బాధ్యత అంబేడ్కర్ వాదులపై ఉందని జేఏసీ చైర్మన్ డేగల సారయ్య అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేడ్కర్ భవనం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యతిథిగా మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా అంబేడ్కర్ సిద్ధాంతాలకు నేటి యువత దూరమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరినీ చైతన్యవంతులను చేయాల్సిన అవసరం అందన్నారు. అంబేడ్కర్ సంఘం బాధ్యతలు తీసుకునే నాయకులు వారు పనిచేస్తున్న రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేయడంతో పాటు రాబోయే తరానికి అంబేడ్కర్ సిద్ధాంతాలను అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు, వివిధ దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేతలో నా ప్రమేయం లేదు

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నబాబు

వేలేరు: మండలంలోని ఎర్రబెల్లి సమ్మక్క దగ్గర ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీల చించివేతలో తన ప్రమేయం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాలేరు చిన్నబాబు అన్నారు. జాతర వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి ప్రభాకర్‌ను జాతరకు రావాలని ఆహ్వానించి, ఫ్లెక్సీలను స్వంత ఖర్చులతో ఏర్పాటు చేశానని అన్నారు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో అమ్మవార్లను తీసుకురావడానికి స్థానిక గుట్టవద్దకు కోయ పూజారులతో వెళ్లి వచ్చేసరికే ఫ్లెక్సీలు చించివేసి ఉన్నాయని తెలిపారు. కొంతమంది వ్యక్తులు తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

రైతులను కాల్చి చంపడం దురదృష్టకరం



కరీమాబాద్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న రామస్వామి, తదితరులు

ఖిలా వరంగల్: దేశానికి అన్నం పెట్టే రైతన్నలను కాల్చిచంపడం దురదృష్టకరమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతన్నలపై అమానుషంగా పోలీసులు జరిపిన కాల్పులతో ఐదుగురు మృతి చెందడాన్ని నిరసిస్తూ ఆదివారం వరంగల్ కరీమాబాద్ రోడ్డుపై సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేస్తుంటే నిరంకుశంగా రైతులపై హర్యానా, పంజాబ్ సరిహద్దు పోలీసులు విచక్షణారహితంగా రైతులపై కాల్పులు జరిపారని, కాల్పుల్లో ఐదుగురు రైతులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాహిత పాదయాత్రను జయప్రదం చేయాలి

- బీజేపీ మండల ఇన్‌చార్జ్ మధుకర్



ఎల్కతుర్తి: మాట్లాడుతున్న మధుకర్



శాయంపేట : మాట్లాడుతున్న తిరుపతి రావు

ఎల్కతుర్తి: ఈనెల 28న మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టనున్న ప్రజాహిత పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ కరండ్ల మధుకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించగా.. మధుకర్ మాట్లాడారు. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి ప్రజలను ఏకం చేసి పాదయాత్రలో పాల్గొనే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పాదయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నాయకులు ముష్కె వెంకటేష్, జనగాని కిష్టయ్య, చిదురాల వెంకటేష్, మధుకర్, అంచనగిరి వెంకటరమణ, కంచర్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : ఈ నెల 29న రేగొండ మండల కేంద్రంలో జరిగే బీజేపీ విజయ సంకల్ప యాత్రకు శాయంపేట చెందిన పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని భూపాలపల్లి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పొలసాని తిరుపతిరావు అన్నారు. ఆదివారం ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలందరూ కష్టపడి సైనికులుగా పని చేసి నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. యాత్రకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మోత్కూరి సత్యనారాయణ, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చిట్టిరెడ్డి మల్లారెడ్డి, చంద్రమౌళి, రాజశేఖర్, తిరుపతి, సీతారాం రెడ్డి, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



ఎస్ఆర్ యూనివర్సిటీ నూతన కమిటీ సభ్యులు

హన్మకొండ: ఇండ్ జీనియస్ ఎస్ఆర్ యూనివర్సిటీ శాఖను ఎన్నుకున్నారు. కమిటీని ఇండ్ జీనియస్ రాష్ట్ర కో కన్వీనర్ సంహిత్‌రెడ్డి, సహ సంఘటన కార్యదర్శి తోట లవన్ ప్రకటించారు. యూనివర్సిటీ అధ్యక్షుడిగా రిషి, కార్యదర్శిగా శ్యామ్, ఉపాధ్యక్షులుగా జి.సౌమ్య, ప్రణయ్, రాజు, జాయింట్ సెక్రటరీలుగా అక్షయ్, జి.అఖిల్, సాయి తేజస్విని, కె.శివాని, కార్యవర్గ సభ్యులుగా నల్లబెల్లి గౌతమి, సాందిరి చర్మిక, సాయివర్ధన్, అభినయ్, మహమ్మద్ హఫీజ్ పాషా, బాలికల ఇన్‌చార్జ్‌గా పావని, సలహాదారుగా గోనె తనుశ్రీ, ఇంటర్న్‌షిప్ సెల్ ఇన్‌చార్జ్‌లుగా కె.సాత్విక, కోరే మనీషా, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లుగా బండి మానీషా, గబ్బర్ సింగ్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

షహీద్ దర్గా ఉత్సవాలు

ఖిలావరంగల్: మధ్యకోటలోని హజ్రత్ చందా షహీద్ దర్గాలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్, ఉపాధ్యక్షుడు సయ్యద్ గౌస్, మహ్మద్ జహీద్ ఆధ్వర్యంలో గంధం, ఉర్సు ఉత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ముగిశాయి. దర్గాను ముస్లిం మత గురువులు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతాలకతీతంగా పెద్దఎత్తున భక్తులు దర్గాపై పూలుచల్లి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్య అతిథిగా కరీమాబాద్ ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా, స్థానిక కార్పొరేటర్ ఉమ, మాజీ కార్పొరేటర్ దామోదర్ హాజరై దర్గాను దర్శించుకున్నారు. గౌస్‌బాబా, వలీ మహ్మద్, ఎగ్బాల్ హైమద్, సలీమ్, మున్ను, సిరాజ్, షఫీ పాల్గొన్నారు.

సేంద్రియ కర్బనంతో నేలకు మేలు



మహిళలు తయారు చేసిన వర్మీ కంపోస్ట్‌ను పరిశీలిస్తున్న కార్ని

శాయంపేట : నిస్సార నేలలకు సేంద్రియ కర్బనం ఎంతో మేలు చేస్తుందని అమెరికాకు చెందిన బీసీఐ ప్రతినిధి కార్ని అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా శాయంపేట మండల పరిధి కొత్తగట్టు సింగారం, గంగిరేణిగూడెం గ్రామాల్లో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మహిళలు తయారు చేస్తున్న వర్మీకంపోస్ట్ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు పంటలకు రసాయన ఎరువులు వాడడంతో నేల నిస్సారంగా మారి దిగుబడులు తగ్గి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. ప్రజ్వల్ సహకారంతో గ్రామాల్లో మహిళలు తయారు చేస్తున్న వర్మి కంపోస్ట్ వినియోగిస్తే నేలలు సారవంతంగా మారి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ దివ్య, డబ్ల్యూడబ్ల్యూఏ అసోసియేట్ డైరెక్టర్ వంశీకృష్ణ, ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ రాంమూర్తి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ ఇన్నారెడ్డి, పీయూ మేనేజర్ ప్రియాంక రెడ్డి పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం..

- ఇంటర్ పూర్తయి అర్ధ శతాబ్దం
- సుదీర్ఘకాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు



నాటి అధ్యాపకులతో ప్రభుత్వ జూనియర్ కాలేజీ 1972-74 బ్యాచ్ విద్యార్థులు

హన్మకొండ చౌరస్తా: వారందరూ ప్రముఖ వైద్యులు, ఇంజనీర్లు, రాజకీయ నేతలు, వ్యాపార దిగ్గజాలు. అయితేనేం ఒకప్పుడు విద్యార్థులే. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 50 సంవత్సరాల క్రితం (1972–74 ఎంపీసీ, బైపీసీ బ్యాచ్) ఇంటర్మీడియట్ చదివారు. అయితే మనువలు, మనువరాళ్లతో గడపాల్సిన వయసులో విద్యార్థి దశ గుర్తుకొచ్చింది. ఇంకేముంది అనుకున్నదే తడవుగా ఆదివారం హనుమకొండలోని అశోకా కాన్ఫరెన్స్ హాల్‌లో కలుసుకున్నారు. నిమ్స్ మాజీ డైరెక్టర్ కందకట్ల మనోహర్ ప్రత్యేక చొరవతో సుమారు 60 మంది మిత్రులు ఒకే వేదికపై కలుసుకున్నారు. వృత్తిరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ ఒకేచోట కలుసుకోవడంతో భావోద్వేగానికి లోనయ్యారు, ఆలింగనం చేసుకుని నాటి రోజులను నెమరువేసుకున్నారు. ఇప్పటి కుటుంబ పరిస్థితులను తెలుసుకుని కష్టాలలో ఉన్న స్నేహితులకు అండగా ఉండాలని ముక్తకంఠంతో నిర్ణయించుకున్నారు. నాటి అధ్యాపకులు కాత్యాయినీ, బలరాం, సువార్త, సోమిరెడ్డి, జనార్దన్‌రావు తదితరులను సన్మానించారు. ఈ సమ్మేళనంలో డాక్టర్ బందెల మోహన్ రావు, డాక్టర్ నీలం సంపత్‌కుమార్, శ్రీధర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, సుమారు 60 మంది పాల్గొన్నారు.

యూనివర్సిటీలను ప్రక్షాళన చేయాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో యూనివర్సిటీలను ప్రక్షాళన చేయాలని తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్, కేయూ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు గాదె దయాకర్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈనెల 24న హైదరాబాద్‌లో సీఎంను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ప్రస్తుత వీసీల పాలన అస్తవ్యస్తంగా మారిందన్నా రు. వెంటనే ఉన్నత విద్యకు న్యాయం చేయాలన్నా రు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అన్నివర్గాలపేద విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించే దిశగా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించినట్లు ఆదివారం ఆయన తెలిపారు. ఇక మూడు నెలల్లో యూనివర్సి టీల్లో వీసీల పాలన ముగియనుందని, త్వరలోనే నియమించబోయే వీసీ లను సమర్థవంతులను, నిజాయితీతో పనిచేసేవారిని నియమించాలని సీఎంకు విజ్ఞప్తిచేసినట్లు దయాకర్ తెలిపారు.